18న జాబ్ మేళా

ప్రజాశక్తి- అరకులోయ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ,జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో, అరకు వేలి ఐటిఐ కాలేజీలో ఈనెల 18న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అల్లూరి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, డాక్టర్ పి. రోహిణి తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అపోలో ఫార్మసీ, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, ఎయిర్టెల్ పేమెంట్స్ బ్యాంక్, భారత్ పే యు, వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు.

జిల్లాలోని 18-30ఏళ్ల వయస్సు కలిగి, ఇంటర్, డిప్లొమా ,డిగ్రీ , బిటెక్ ఆపై విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువత ఇంటర్వ్యూకు తమ పాన్ కార్డు, ఆధార్‌కార్డు, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.పదివేలు నుంచి రూ.20వేలు వరకు వేతనం చెల్లిస్తారన్నారు. పూర్తి వివరాలకు https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్ లేదా 91775 17373, 9398338105 మొబైల్ నెంబర్లకు సంప్రదించాలన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని రోహిణి కోరారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ హెల్త్ సెక్రటరీలు

ప్రజాశక్తి -పాడేరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సచివాలయ ఎఎన్ఎంలు, విలేజ్ హెల్త్ సెక్రటరీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా సచివాలయ హెల్త్ సెక్రటరీల సంఘం ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయంలో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలందరూ మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్లో పని చేస్తూ, ఎంపిడిఒ ఆధ్వర్యంలో జీతాలు తీసుకుంటున్నారన్నారు. దీనివల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తమను వైద్యఆరోగ్యశాఖ పరిధిలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఫేషియల్ హాజరును సచివాలయంలోనే వెయ్యాలనే నిబంధన తొలగిస్తూ ఏ గ్రామంలో విధులకు వెళ్తే ఆ గ్రామంలో వేసేలాగా అవకాశం కల్పించాలని, సీనియారిటీ లిస్టును తయారుచేసి గ్రేడ్ 3 నుండి గ్రేడ్ 2 కు ప్రమోషన్ కల్పించాలని, ప్రసూతి సెలవులను డెలివరీకి ఒక నెల ముందునుండే అవకాశం కల్పించాలని, ఆర్‌సిహెచ్ రాకచకింగ్ నగదును, యూనిఫామ్ అలవెన్స్‌లను మంజూరు చేయాలని, పెన్షన్ పంపిణీ బాధ్యతలను తమకు అప్పగించకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సుందరరావు సచివాలయ హెల్త్ సెక్రటరీ లు సుశీల, బేబీ రాణి, భవాని, శెట్టి సుశీల, పూర్ణ, బుల్లమ్మ, పద్మ, చండ మహేశ్వరి పాల్గొన్నారు

ప్రశాంతంగా మద్యం దుకాణాల లాటరీ

- జిల్లాలో 40 షాపుల కేటాయింపు
- ప్రక్రియ పారదర్శకంగా సాగింది : జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - పాడేరు : జిల్లాలో 40 మద్యం షాపుల నిర్వహణకు సోమవారం నిర్వహించిన లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పారదర్శకంగా కేటాయింపుల ప్రక్రియ సాగినట్టు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. వాస్తవానికి పాడేరులో 10, అరకులో 6, చింతపల్లిలో 6, రంపచోడవరంలో 10, చింతూరులో 8 వెరసి 40 మద్యం షాపులకుగాను 1203 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం స్థానిక విఆర్ ఫంక్షన్ హాలులో వీటికి లాటరీ ప్రక్రియ చేపట్టారు. గెలుపొందిన వారికి షాపులు కేటాయించారు. గెలుపొందిన వారు సకాలంలో డబ్బులు చెల్లించకపోతే తదుపరి గెలుపొందిన వారికి షాపు కేటాయించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో అన్ రిజర్వుడ్ కేటగిరీ లేకపోయినప్పటికీ పాడేరుకు సంబంధించి ఒక షాపునకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఒక గిరిజనేతరునికి లాటరీలో షాపు రావడంతో తదుపరి వ్యక్తికి షాపు కేటాయించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎక్సైజ్ శాఖ విశాఖ పట్నం సహాయ కమిషనర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో చింతూరు డివిజన్ లోని 8 మద్యం దుకాణాల కోసం అత్యధికంగా 70 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జిల్లాలో

మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ తీస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మద్యం దుకాణాల కోసం వచ్చిన 1203 దరఖాస్తుల రుసుము ద్వారా ప్రభుత్వానికి రూ.24 కోట్ల 10 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. ఆరో వంతు ఫీజు చెల్లించిన వారికి ప్రస్తుతం 15 రోజులకు తాత్కాలిక లైసెన్సులను తక్షణమే మంజూరు చేస్తున్నామని తెలిపారు జిల్లాలో మహిళలకు నాలుగు మద్యం దుకాణాలు వచ్చాయన్నారు. లాటరీ ప్రక్రియలో జెసి డాక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ్, రంపచోడవరం సహాయ ఎక్సైజ్ పర్యవేక్షకులు నాగ రాహుల్ పాల్గొన్నారు.

రోగితో మాట్లాడుతున్న ఎంపిపి, సిపిఎం నాయకులు

వైద్యులు అందుబాటులో ఉండాలి

ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని ఎంపిపి కారం లక్ష్మి అన్నారు. మండలంలోని రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం ఎంపీపీ కారం లక్ష్మితో పాటు స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని, సిపిఎం నాయకులు సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిపి లక్ష్మి మాట్లాడుతూ ఆసుపత్రిలో డాక్టర్, వైద్య సిబ్బంది ఎవరూ లేరని తెలిపారు. సోమవారం సంత కావడంతో అన్ని గ్రామాల నుండి ప్రజలు మండల కేంద్రానికి వస్తారని, ఈ సమయంలో డాక్టర్, సిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొంత మంది ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి చేతిచమురు వదిలించుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ఉండి కూడా వైద్య అందకపోవడంపై ఆమె మండిపడ్డారు. తక్షణమే డాక్టర్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు సరైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీరామగారి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు బంకు సత్తిబాబు, కె.సత్యనారాయణ, సిహెచ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన అధికారులను కలిసిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి -కూనవరం : మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ కె.శ్రీనివాసరావును, ఎస్ఐ లతశ్రీని సీపీఎం ప్రజా ప్రతినిధులు, ఆ పార్టీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే ప్రతి ఒక్కరికీ సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సర్పంచులు మడకం నాగమణి, సోడే శంకర్, ఎంపీటీసీ ధర్ముల అమ్మాజీ, నాయకులు తలగాని నాగరాజు, తాళ్లూరి శ్రీనివాసరావు, మడెం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారును కలిసిన సిపిఎం నాయకులు, ప్రజాప్రతినిధులు

శతశాతం ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులతోనే భర్తీ చేసేందుకు..

ఆర్డినెన్సు తేవాలి

- 16న క్యాబినెట్ సమావేశంలో ఆదివాసీ ఉద్యోగ రిజర్వేషన్‌పై చర్చించాలి
- రాష్ట్ర గిరిజన సంక్షేమ మంత్రికి, ఉన్నతాధికారులకు ఆదివాసీ గిరిజన సంఘం బహిరంగ లేఖ

ప్రజాశక్తి -పాడేరు: రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ప్రాంతంలోని స్థానిక ఆదివాసీ నిరుద్యోగులకు నూరు శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించి, ఆదివాసీలకు తగు న్యాయం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ నేతలు పి అప్పలనరస, కిల్లో సురేంద్ర, లోతా రామారావు, ధర్మన్న పడాల్, పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు.ఈ నెల 16న నిర్వహించే రాష్ట్ర కేబినెట్‌లో దీనిపై చర్చించి ఆర్డినెన్స్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేబినెట్‌లో వివిధ అంశాలపై చర్చకు ఆయా విభాగాల నుంచి ప్రతిపాదనలు పంపాలని ముఖ్య కార్యదర్శులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఈనెల 11న ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో గిరిజన సంక్షేమశాఖ దీనిపై ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని కోరారు. దీనిపై గిరిజన సంక్షేమశాఖమంత్రి, ఉన్నతాధికారులకు ఆదివాసీ గిరిజన సంఘం తరపున బహిరంగ లేఖ రాశారు.

మెగా డిఎస్‌సి ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మొట్టమొదటి సంతకం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. 2024 డిసెంబర్ 30 నాటికి నియాకపు ప్రక్రియ పూర్తిచేయాలని విద్యాశాఖకు ఆదేశించిన విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు కాగా 5వ షెడ్యూల్డ్ ఏరియాలో 100 శాతం రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వలేదని, ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పిస్తున్న జిఒనెంబర్ 3పై సుప్రీంకోర్టు తీర్పుకు ప్రత్యామ్నాయంగాఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు ఉద్యోగ రిజర్వేషనుకు గత రాష్ట్ర ప్రభుత్వం 5వ షెడ్యూల్డ్ క్లాజ్ (2) ప్రకారం చట్టబద్ధత కల్పిస్తామని ట్రైబల్‌అడ్వైజర్ కౌన్సిల్(టిఏసి)లో తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజన సంక్షేమశాఖ సిఫార్సు చేసిందన్నారు. మరోపక్క కూటమి ప్రభుత్వం ప్రకటించిన జనరల్ డిఎస్సీ నోటిఫికేషన్‌తో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్రమైన అభద్రత భావం, ఆందోళన కలిగిస్తోందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా గిరిజన గురుకుల విద్యాసంస్థలలో ఖాళీ పోస్టులను నోటిఫికేషన్‌లో పేర్కొన్నారని వెల్లడించారు

రాజ్యాంగంలో 5వ షెడ్యూల్ ఏరియాలో ఆదివాసులకు భద్రత, రక్షణ, పరిపాలన బాధ్యతకు స్పష్టంఆ పేర్కొన్న నేపథ్యంలోరాష్ట్రప్రభుత్వం జారీ చేసే ఏ ఉత్తర్వులైనా 5వ షెడ్యూల్ క్లాజ్ (1)(2) ప్రకారం గవర్నర్, టిఉ.సి ఆమోదం తప్పకుండా తీసుకోవాలని.. ఈ పభుత్వంరాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని కోరారు.ఆదివాసులకు ప్రత్యేక భాష సంస్కృతి ఉందని, గిరిజన భాష రాని వారిని ఏజెన్సీలో నియమించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. గత ప్రభుత్వం కాలంలో 1998, 2008లో సుమారు 400, ఇంకా 280 ఎస్‌జిటి పోస్టులను పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో మినిమం టైం స్కేల్ ప్రాతిపదికన స్థానికేతరులతో భర్తీ చేశారన్నారు 1/70 చట్టం ప్రకారం స్థిర నివాసానికి అనుమతులు లేని వారు 2 శాతం మాత్రమే ఉన్న గిరిజనేతరులకు 95శాతం పోస్టులు భర్తీచేయడం, 98 శాతం మంది వున్న ఆదివాసుల కోసం కేవలం 6 శాతం పోస్టులు మాత్రమే కేటాయించి భర్తీ చేయడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే జనరల్ డిఎస్‌సి నోటిఫికేషనును పునర్ పరిశీలించి, ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ నిరుద్యోగులకు భద్రతా, భరోసా కల్పించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం తరపున కోరుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

వంతెనలు, కాజ్‌వేలు నిర్మించాలి

సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారుల్లో వంతెనలు, కాజ్‌వేలు నిర్మించి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో సిపిఎం శాఖ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోతురాజు మాట్లాడుతూ 2014లో హుదూద్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు చంపపట్టి గెడ్డపై కాజువే కొట్టుకుపోయిందని, పదేళ్లుగడిచినా దాన్ని పునర్నిర్మించకపోవడంతో చంపబట్టి, శీలం గొంది ప్రాంత గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మండల కేంద్రానికి సుమారు రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న పివిటిజి గ్రామం పెదపాడు గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారని, చాపరాయి గెడ్డ వద్ద వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్ గుర్మిసింగ్, స్వామి పాల్గొన్నారు.

పోడు భూములకు సాగుహక్కు పట్టాలివ్వాలి

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి.-అనంతగిరి : తాతముత్తాతల నుంచి సాగులో ఉన్న కొండపోడు భూములకు సాగుహక్కు పట్టాలివ్వాలని సోమవారం తీగాలమడలో నిర్వహించిన సిపిఎం శాఖ మహా సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. కొత్తూరు పంచాయతీ, తీగామడలో నిర్వహించిన శాఖ మహాసభలో సిపిఎం టోకూరు సర్పంచ్ కిల్లో మొస్య మాట్లాడుతూ కొత్తూరు పంచాయతీ పరిధిలోని తీగలమాడ, చిటలగరువు, వంటలమామిడి తోటవలసలలో 60 మంది గిరిజనులను పూర్వకాలం నుంచికొండపోడు భూములను సాగుచేస్తూ జీవనం పొందుతున్నారని, అయితే కేవలం 12మందికే సాగుహక్కు పట్టాలిచ్చారన్నారు. అటవీ హక్కుల చట్టం అమల్లోకి వచ్చి 18ఏళ్లు కావస్తున్నా, నేటికీ గిరిజనులకు వాటి ఫలాలుఅ ందకపోవడం దుర్మార్గమన్నారు. రైతులు సాగులో ఉన్న భూముల్లో జీడి మొక్కలు నాటిన చోటనే ప్లాంటేషన్ వేస్తామని ఫారెస్టు అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గిరిజన రైతులు సాగులో ఉన్న భూముల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం కొత్తూరు పంచాయతీ సిపిఎం శాఖ కార్యదర్శిగా పాలికి ఓసేపును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాంగి పుయు, బురిడి హరి, గెమ్మెల లక్ష్మణరావు. సారా రామన్న, అంబ్రి పాల్గొన్నారు.

వలసపల్లి గ్రామస్తులకు రహదారి కష్టాలు

- వరదలకు అస్తవ్యస్తమైన మట్టిదారి
- ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని స్థితి
- పక్కా రోడ్డు నిర్మించాలని వేడుకోలు

ప్రజాశక్తి-సీలేరు

జీకే.వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి వలసపల్లి, మునసపల్లి గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేక ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాలకు ప్రభుత్వం రహదారి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో మట్టిదారిని ఏర్పాటు చేసుకొని రాకపోకలు సాగిస్తూ వస్తున్నారు. నిత్యవసర సరుకులను కొనుగోలుతో పాటు వైద్య సేవలు పొందడానికి ఆయా గ్రామాల ప్రజలు రాళ్లు, గుట్టలు, వాగులు దాటుకుంటూ ప్రధాన రహదారికి చేరుకుని అక్కడి నుంచి ఆటోలు, జీపులపై సీలేరు వస్తూ ఉంటారు. సెప్టెంబర్ 8న అర్ధరాత్రి భారీ వర్షాలకు కొండలపై నుంచి వచ్చిన వరద ఉధృతికి భారీ వృక్షాలు కొట్టుకురావడంతో మట్టిదారి పూర్తి ఛిద్రమైంది. రాళ్లు, గుట్టలు, పెద్ద పెద్ద చెట్లు ఈ దారిపై పేరుకుపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఆయా గ్రామాల గిరిజనుల రాకపోకలకు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. ద్విచక్ర వాహనాలు కూడా ఈ మార్గంలో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వరదలు వచ్చి నెల రోజులైనా తమ గ్రామాలకు అధికారులు ఎవరూ రాలేదని, ప్రజలు ఎలా ఉన్నారు? రహదారులు ఎలా ఉన్నాయో పరిశీలించే వారే లేకపోయారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రహదారి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు గురవుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి దారిపై పేరుకుపోయిన చెట్లు, రాళ్ల, మట్టిదిబ్బలు తొలగించి, కోతకు గురైన కాలిబాటకు మరమ్మతులు చేపట్టాలని, నిధులు మంజూరు చేసి పక్కా రహదారి నిర్మించాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

వరదలకు చెట్లు కొట్టుకొచ్చి మట్టి రహదారిపై పేరుకుపోవడంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న దృశ్యం

పబ్లిక్ గ్రీవెన్స్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్ట సింహాచలం ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పిఒ సింహాచలంతో పాటు సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఐటీడిఎ ఏపీఓ జనరల్ డిఎన్వి.రమణ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. 54 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్‌రాజ్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, వెలుగు ఏపిడి డేగలయ్య, డీఈవో వై.మల్లేశ్వరరావు, జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, డాక్టర్ వెంకట ఇందిరా, డియల్‌డిఓ కె.కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, సుబ్బయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శాశ్వత హాస్టల్ భవనాలు ఏర్పాటు చేయాలి

రాజ మహేంద్రవరంలో వివిధ కళాశాలలో చదువుకుంటున్న ఆదివాసీ విద్యార్థులకు అదనపు శాశ్వత హాస్టల్ భవనాలు మంజూరు చేయాలని సోమవారం ఐటిడిఎలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలంకు ఆదివాసి జేఏసీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు తెల్లం శేఖర్, కారం రామన్న దొర, తెల్లం కామన్న దొర తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తున్న ఐటిడిఏ పిఒ సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ తదితరులు

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

- బైకిస్టు దుర్మరణం
- గంటల తరబడి రోడ్డుపైనే మృతదేహం
- పోలీసులు తీరుపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి-ఎటపాక

మండలంలోని గన్నవరం శివారులో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో బైకిస్టు దుర్మరణం చెందిన సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ప్రకారం... ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం, రుద్రంకోట గ్రామానికి చెందిన గాదె అనిల్ (40) పురుగు మందుల కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నారు. తన పని నిమిత్తం కూనవరం వచ్చి సోమవారం మధ్యాహ్నం తిరిగి వెళ్తుండగా, గన్నవరం శివారులో భద్రాచలం నుండి ఎదురుగా వస్తున్న గ్యాస్ సిలిండర్ల లారీ అనిల్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. గ్యాస్ సిలిండర్ల లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో, వేగంగా డ్రైవింగ్ చేసి నిండు ప్రాణాన్ని బలిగొన్నాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాదం మధ్యాహ్నం 12 గంటల సమయంలో జరిగితే సాయంత్రం 4 గంటల వరకు మృతదేహం రోడ్డు పైనే పడి ఉంది. పోలీసులకు సమాచారం అందినా గంటల తరబడి రాలేదని, ఒక మృతదేహానికి పంచనామా చేసి తరలించడానికి అంత సమయం ఎందుకు తీసుకున్నారో తెలియడం లేదని వాహనదారులు వాపోయారు. రోడ్డుపై మృతదేహం పడి ఉంటే పట్టించుకోని పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సంఘటనా స్థలంలో అనిల్ మృతదేహం

19న ప్రజా దర్బార్

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండల కేంద్రం మారేడుమిల్లి గ్రామంలో ఈ నెల 19వ తేదీన ప్రజా దర్బార్ సభ నిర్వహించనున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు గురువు శేషుకుమార్ తెలిపారు. ఈ మేరకు స్థానిక పాత ఎంపీడీవో కార్యాలయం మైదానంలో సభ ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిడిఒ ఎ.వీరకిశోర్‌తో కలిసి టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ ప్రజా దర్బార్‌కు ముఖ్య అతిథులుగా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షుడు విజయ భాస్కర్ పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.వీరకిషోర్, టిడిపి మండల ఉపాధ్యక్షుడు కర్రి సన్యాసిరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు బీసెట్టి అప్పాజీ పాల్గొన్నారు.

ప్రజా దర్బార్ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ, టిడిపి కూటమి నాయకులు

వైద్య విద్యాభ్యాసానికి పాడేరు అనుకూలం

పాడేరు వైద్యకళాశాల, తరగతులు ప్రారంభంలో కలెక్టర్ దినేష్‌కుమార్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు : నైపుణ్యమైన వైద్యవిద్యను అభ్యసించేందుకు పాడేరు అనువైన, సురక్షిత ప్రాంతమని, విద్యార్థులు భయాందోళనలు లేకుండా వైద్యవిద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ మెడికల్ విద్యార్థులకు సూచించారు. పాడేరు మెడికల్ కాలేజీలో సోమవారం నుంచి మెడికల్ కళాశాలను, ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం తరగతులను జిల్లా కలెక్టర్ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ ఏడాది నుంచే మెడికల్ కాలేజీలను ప్రారంభించాలని కృతనిశ్చయంతో చర్యలు చేపట్టిందన్నారు. నెల రోజులుగా ఇంజినీరింగ్ అధికారులు అత్యంత కృషి చేసి మెడికల్ కళాశాలతో పాటు అనాటమీ, ఫిజియాలజీ, బయో-కెమిస్ట్రీ ల్యాబులు, తదితరాలు భవనాలను పూర్తి చేసి అందివ్వడం గొప్ప విషయమని కొనియాడారు ఈ ఏడాది నుండే పాడేరు వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభించాలని, 50 మందికి ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం ప్రవేశాలు కల్పించారు. కాగా తొలిరోజున 42 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కాలేజీ ఆహ్వానం మేరకు హాజరయ్యారన్నారు. పాడేరులో వైద్యవిద్య అంటే కొంతమంది తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తున్నట్లు తెలిసిందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎటువంటి అపోహలు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతమైనా, ఇతర ప్రాంతాలతో పాడేరుకు కనెక్టవిటీ ఉందని, అలాగే ఎటువంటి సమస్యలు లేని ప్రశాంతమైన వాతావరణం పాడేరులో ఉందన్నారు. విద్యార్థులకు అన్ని రకాలుగా రక్షణ కల్పిస్తామని, మరో రెండు మూడు నెలలలో పూర్తిస్థాయి సౌకర్యాలు, ఆటస్థలం కూడా అందుబాటులోకి వస్తుందని భరోసానిచ్చారు. విద్యార్థులకు థియరీతోపాటు ప్రాక్టికల్‌గా అవగాహనకు ఇక్కడి ఆసుపత్రిలో అవుట్ పేషంట్లు, ఇన్‌పేషెంట్లు అందుబాటులో ఉంటారన్నారు. ఏజెన్సీలోని గిరిజనులకు వచ్చే వ్యాధులపై అధ్యయనం, అవగాహన ద్వారా వారికి వైద్యసేవలు అందించే భాగ్యాన్ని దక్కించుకోవడంతోపాటు, ఇక్క కళాశాలలో అన్ని శాఖల విభాగాధిపతులు, ప్రొఫెసర్లు, సహాయ ప్రొఫెసర్లు విద్యార్థులను స్వంతంగా భావించి వారి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

సంయుక్త కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ 2010లో తాను వైద్య విద్యను అభ్యసించిన నాటి అనుభవాలను వివరించారు. అన్ని వృత్తులలోకెల్లా వైద్య విద్యకు ప్రాధాన్యత ఉందని, డాక్టర్ అంటే ప్రాణాలు రక్షించేవాడని, అంతటి ప్రాధాన్యత ఉన్న విద్యను అభ్యసించడం గర్వంగా భావించాలన్నారు. పాడేరు కళాశాలలో మొదటి బ్యాచ్ విద్యార్థులు రానున్న బ్యాచ్‌లకు ఆదర్శంగా, నమూనాగా నిలవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు గర్వపడేలా వైద్యవిద్యను పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హేమలత దేవి, మెడికల్ సూపర్‌వైజర్ ప్రొఫెసర్. విశ్వామిత్ర, నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎఎన్ బి శ్రీనివాస్, ఎపిఎంఎస్ఐడిసి కార్యనిర్వాహక ఇంజినీర్ డి.అచ్చెంనాయుడు పాల్గొన్నారు.

సౌకర్యాలు బాగున్నాయి

నీట్‌లో 594వ ర్యాంకు పొందానని, పాడేరులో ప్రవేశానికి వెనుకడుగు వేసినా, కళాశాల ప్రిన్సిపాల్, ఇతర విభాగాధిపతులు ప్రోత్సహించారు. ఇక్కడి వాతావరణం, తరగతి గది, ల్యాబ్, మ్యూజియం, వసతి అన్నీ బాగున్నాయి. ఇతర కళాశాలల కంటే మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి.

కె. భావన,
ఎంబిబిఎస్ విద్యార్థిని,
గుంటూరు

డాక్టర్ కావాలన్నదే లక్ష్యం

అపెండిసైటిస్ వచ్చినపుడు పది రోజులు ఆసుపత్రిలో ఉన్నానని,డాక్టర్లు తగు చికిత్స చేసి ఆరోగ్యం కాపాడారన్నారు. అప్పుడే డాక్టర్ కావాలని నిర్ణయించుకున్నా. ఎంబిబిఎస్ సీటు సాధించి, పాడేరులో చేరడం ఆనందంగా ఉంది

ధాత్రి, వైద్యవిద్యార్థిని
రాజమండ్రి

కాలేజీ యాజమాన్యం ప్రోత్సాహించింది

ఇద్దరు అమ్మాయిలను డాక్టర్లు చేయాలన్నదే లక్ష్యం, పెద్దమ్మాయి ఒంగోలు మెడికల్ కాలేజీలో థర్డ్‌ఇయర్ చదువుతోంది. రెండోఅమ్మాయికి పాడేరులో సీటురాగా, వద్దనుకున్నాం. కాలేజీ యాజమాన్యం మోటివేట్‌చేసింది. వారి ప్రోద్బలంతోనే ఎంబిబిఎస్‌లో జాయిన్ చేయించాను. ఇక్కడ కాలేజీ బాగుంది.

బాషా,
వైద్యవిద్యార్థిని తండ్రి,
ఒంగోలు

సమస్యలను గాలికొదిలేసి, పారా రైడింగ్ అవసరమా?

ప్రజాశక్తి -డుంబ్రిగుడ : ఐటిడిఎ నిధులతో పర్యాటకుల కోసం హాట్ ఎయిర్ బెలూన్, పారా మోటర్ రైడింగ్ ఏర్పాటు చేయడం అవసరమా అని మాజీ ఎంపిపి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సిహెచ్ సాయిబాబా ప్రశ్నించారు.. సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జైపూర్ జంక్షన్‌లో, పద్మాపురంలో పర్యాటకుల కోసం వీటిని ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇప్పటికే అనేక మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు తాగునీరు రోడ్డు వంటి మౌలిక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతుంటే వాటిని పరిష్కరించకుండా ఐటిడిఎ నిధులను పర్యాటకుల కోసం వెచ్చించడం సబబా అని ప్రశ్నించారు. ప్రకృతి సహజసిద్ధంగా ఏర్పడిన బొర్రా గుహలను ఆధునికీకరించాలని కోరారు.కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ టి సోమేశ్వరరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పి చిన్న స్వామి, జె వెంకట బాబు పాల్గొన్నారు.

సేంద్రియ విధానంలో సాగు ఆరోగ్యదాయకం

- వ్యవసాయ సహాయ సంచాలకురాలు జాహ్నవి

ప్రజాశక్తి - చింతపల్లి :రసాయన ఎరువుల వాడకాన్ని మానుకుని సేంద్రీయ విధానంలో సాగ చేస్తే, ఆరోగ్యకరమైన పంటలు పండుతాయని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.జాహ్నవి అన్నారు. సోమవారం మాట్లాడుతూ మారుతున్న కాలంలో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు. దీనివలన భూసారంతోపాటు పర్యావరణం చెడిపోతుందని, వాటిద్వారా పండిన ఉత్పత్తులను తింటే ప్రజారోగ్యాలు దెబ్బతింటాయన్నారు. సేంద్రీయ పద్ధతిలో సాగు చేసే ఉత్పత్తులకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుందన్నారు. మైదాన ప్రాంతాలతో పోల్చి చూస్తే మన్య ప్రాంతంలో సేంద్రీయ సాగు విధానం ఉందన్నారు. సేంద్రియ పద్ధతులలో సాగు చేసే చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యాలు బాగుపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ సేంద్రియ విధానాన్ని ప్రోత్సహించాలన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చునని సూచించారు. గిరి రైతులు పూర్వ విధానాలను కొనసాగించాలని సూచించారు.

పలుచోట్ల ఘనంగా పల్లె పండుగ

అనంతగిరి మండలం తాడిగుడలో...

ప్రజాశక్తి -యంత్రాంగం

డుంబ్రిగుడ: మండలంలోని కుర్రాయి పంచాయతీ తోటవలస గ్రామంలో సర్పంచ్ పి.కొములు ఆధ్వర్యంలో సోమవారం పల్లె పండగ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గోశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు, టిఎన్టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం స్వామి, జనసేన పార్టీ నాయకుడు లక్ష్మణరావు, అధికారులు పాల్గొన్నారు.

అనంతగిరి : మండలంలోని అనంతగిరి పంచాయతీ తాడిగుడ గ్రామంలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా అనంతగిరి మెయిన్ రోడ్డు నుండి తాడిగుడ జలపాతం వరకు రూ.6 కోట్ల నిధులతో రోడ్డు నిర్మాణానికి స్థానిక సర్పంచ్ సోమ్మెల రూతు ఆధ్వర్యంలో జెడ్‌పిటిసి దీసరి, గంగరాజు, ఎంపిపి శెట్టి,నీలవేణి, అరకు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి సియారి దొనుదొర శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జె.అప్పారావు కొర్రా సింహాద్రి, ఎంపిడిఒ ఎవివి ,కుమార్ ఎన్ఆర్ఈజీఎస్ ఎపిఒ నాయుడు, ఇసి పవన్, ట్రైబల్ వెల్ఫేర్ జెఇఇ గణేష్ పాల్గొన్నారు.

చింతపల్లి : బలపం పంచాయతీ కోరుకొండ గ్రామంలో ఇంకుడు గుంత నిర్మాణానికి పంచాయతీ సర్పంచ్ కొర్రా రమేష్ నాయుడు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి లకే శివప్రసాద్, ఇఓఎస్ ఇసి మధుసూధన్. టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ కొంటా కోటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది చిరంజీవి, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీను, మహిళ పోలీస్ రవణమ్మ, గ్రామ పెద్దలు చిట్టి బాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు
బెన్నవరంలో కమ్యూనిటీ షాక్ పిట్‌ను సర్పంచ్ బచ్చల సన్యాసమ్మ, ఎంపిటిసి సోనితో కలసి శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఎపిఒ లక్ష్మీనారాయణమూర్తి, ఎన్డీఏ కూటమి నాయకులు ఉల్లి సీతారాం, ఉగ్రంగి లక్ష్మణరావు, ఉపాధిహామీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
అన్నవరం పంచాయతీలో అభివృద్ధి పనులకు సర్పంచ్ పాంగి సన్యాసిరావుతో కలిసి ఎంపిటిసి కొర్ర సూరిబాబు శంకుస్థాపన చేశారు.ఎపిఒ లక్ష్మీనారాయణ, ఎన్డీఏ కూటమి నాయకులు, ఉపాధిహామీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్.పురం :మండలంలోని పలు గ్రామాల్లో ఎంపిడిఒ ఆర్.ఫణీంద్రరెడ్డి ఆధ్వర్యంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ చినమట్టపల్లిలో రూ.2.73 కోట్లు, పెడమట్టపల్లిలో రూ.5 కోట్లు, జీడిగుప్పలో రూ.54 లక్షలు, కుందులూరులో రూ.1.48 కోట్లు, ములకనపల్లిలో రూ.1.87 కోట్లు, రాజుపేటలో రూ.76 లక్షలు, రేఖపల్లిలో రూ.7.90 కోట్లు, రామవరంలో రూ.2.20 కోట్లు, శ్రీరామగిరిలో రూ.1.31 కోట్లు, తుమ్మిలేరులో రూ.27 లక్షలు, వడ్డిగూడెంలో రూ.2.14. కోట్లు, వెరసి విఆర్.పురం మండలంలో రూ.26.05 కోట్లుతో సిసి రోడ్లు, బిటి రోడ్లు, అన్నవరం వంతెన, గోకులం షెడ్లు, ఫారం పాండ్స్, ట్రెంచెస్ తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి కారం లక్ష్మి, జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎన్ఆర్ఇజిఎస్ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
రేఖపల్లి పంచాయతీలో పల్లె పండుగ సందర్భంగా శుద్ధ గూడెం గ్రామం నుండి పెద్దమట్టపల్లి వరకు రహదారి నిర్మాణ పనులను ఎంపీపీ కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్ పూనం సరోజిని, ఎంపీడీవో ఫణేంద్ర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఈ రహదారి పూర్తయితే సుమారు 20 గ్రామాల ప్రజలు రేఖపల్లిలోని ఆస్పత్రులకు, బ్యాంకులకు, నిత్యవసర సరుకులకు, ప్రభుత్వ కార్యాలయాలకు రావడానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, పెద్దమట్టపల్లి ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, మండల నాయకులు పంకు సత్తిబాబు, కె.సత్యనారాయణ, టిడిపి నాయకులు బుర్కా కన్నారావు, సవలం రాజేంద్రప్రసాద్, ఎన్ఆర్ఇజిఎస్ ఏపిఒ, సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం : మండలంలోని వాడపల్లి పంచాయతీ ఇసుకపట్ల గ్రామంలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఎన్ఆర్ఇజిఎస్ పనుల్లో భాగంగా చెదల అబ్బాయి రెడ్డి పొలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మిరియాల శిరీష పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్‌దొర, ఏపీవో సత్యనారాయణ, టిడిపి నాయకులు కారం సురేష్ బాబు, అడబాల బాపిరాజు, వై నిరంజనీ దేవి, జనసేన నాయకులు కుర్ల రాజశేఖర్‌రెడ్డి, పాపోలు శ్రీనివాస్ రావు, ఎంపిటిసి మంగాయమ్మ పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండలంలోని సున్నంపాడు పంచాయతీ తుత్రూరు గ్రామంలో ఎంపీడీవో వీర కిషోర్ ఆధ్వర్యంలో పల్లె పండు కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ నిధులతో రహదారుల నిర్మాణం చేస్తామని, గ్రామీణ వాసులకు చేతినిండా పని లభిస్తుందని ఎంపిడిఒ తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో రెడ్డి బాబు, సున్నంపాడు సచివాలయ సిబ్బంది, పంచాయితీ ప్రజలు పాల్గొన్నారు.

రంపచోడవరం మండలం ఇసుకపట్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

అరకులోయలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

ఘనంగా మాజీ మంత్రి కిడారి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మాజీ మంత్రి, టిడిపి అరకు పార్లమెంట్ అధ్యక్షులు కిడారి శ్రావణ్‌కుమార్ జన్మదిన వేడుకలను సోమవారం అరకులోయలో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ చేశారు. ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.ఈ సందర్భంలో కూన రమేష్ , మాజీ వైస్ ఎంపిపి పొద్దు అమ్మన్న, మాట్లాడుతూ మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ప్రజల మన్ననలు పొందిన నాయకుడని, భవిష్యత్తులో ఉన్నతమైన శిఖరాలు అధిరోహించాలని , ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పద్మాపురం పంచాయతీ టిడిపి నాయకులు కిల్లో సాయిరాం,తెలుగు యువత అసెంబ్లీ కార్యదర్శి దన్నాయికి రమేష్, తెలుగు మహిళ అరకు నియోజవర్గ అధ్యక్షురాలు ఎల్‌బి. కళావతి,అరకు వేలి మండల అధ్యక్షురాలు వంతల ద్రౌపది, వార్డు సభ్యుడు వంతాల డేవిడ్, అప్పలరాజు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ:మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ జన్మదిన వేడుకను గుంటసీమలో టిడిపి మండల నాయకుడు ఎస్ జక్కయ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మదిన కేక్ ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చిరంజీవి పాల్గొన్నారు.

అక్రమంగా రవాణా చేస్తున్న కలప స్వాధీనం

ప్రజాశక్తి - దేవీపట్నం : దేవీపట్నం మండలం ఇందుకూరు పరిసర ప్రాంతాల్లో అక్రమ కలప రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమంగా రవాణా చేస్తున్న కలపను ఆదివారం రాత్రి అటవీశాఖ అధికారులు పట్టుకొని గోకవరం రేంజ్ కార్యాలయానికి తరలించారు. అక్రమార్కులు వేప, జీడి మామిడి కలపను అడ్డం పెట్టుకుని మారుజాతి అడవి కలపను తరలిస్తుండగా పట్టుకున్నారు. వాటికి సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియవలసి ఉంది.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టు కార్డు ఉద్యమం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టు కార్డు ఉద్యమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్టు ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్, రైటర్స్ అకాడమీ అధ్యక్షులు వివి.రమణమూర్తి తెలిపారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వివిధ సంఘాల ప్రతినిధులతో కలిసి సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆధ్వర్యాన 2025 జనవరి 27న లక్ష మందితో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు దశల వారీ చేపట్టాల్సిన కార్యాచరణను రమణమూర్తి అందరికీ వివరించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచీ కేంద్రానికి పోస్టు కార్డు పంపించి తమ నిరసన గళాన్ని వినిపించనున్నామని, విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ఎందుకు ప్రైవేటీకరణ చేస్తుందో ఇంటింటికీ వెళ్లి తెలియజేయనున్నామని, ఉత్తరాంధ్ర ప్రజల మద్దతుతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం తక్షణమే రూ.10 వేల కోట్ల సాయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిఎం చంద్రబాబు ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలతో మాట్లాడతానని ప్రగల్భాలు పలికారని, కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయమై ఆయన ఎలాంటి తీపికబురూ చెప్పలేదని మండిపడ్డారు. ప్లాంట్‌ను మోడీ ప్రభుత్వం దొడ్డిదారిన ప్రైవేట్‌పరం చేయాలని చూస్తోందని, అదానీ, జిందాల్ తదితర కార్పొరేట్ గ్రూపులకు లబ్ధి చేకూరేలా సహకరిస్తోందని ఆరోపించారు. గతంలో గంగవరం పోర్టును కూడా అదే మాదిరి ప్రైవేట్‌పరం చేసేశారని గుర్తుచేశారు. సుమారు 10 లక్షల మంది విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి బతుకుతున్నారని, అలాంటి కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడం దుర్మార్గమని అన్నారు.

అల్లిగూడెంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని అల్లిగూడెం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం అల్లిగూడెం శాఖ మహాసభ డిమాండ్ చేసింది. గ్రామంలో సోమవారం జరిగిన శాఖ మహాసభలో సిపిఎం నాయకులు మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన నిధులతో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి పైప్‌లైన్ నిర్మాణం వదిలేశారని, ఆ నిధులను దుర్వినియోగం చేశారని, దానిపై సమగ్ర విచారణ మహాసభ డిమాండ్ చేశారు. గ్రామంలో వోల్టేజ్ సమస్య వల్ల విద్యుత్ సమస్యలు ఎదురవుతున్నాయని, తక్షణమే త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధి హామీ పనులను గ్రామంలోనే కల్పించాలన్నారు. వలస ఆదివాసీల పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడం తగదని, తక్షణమే వారి పూర్వీకులు ఆధారంగా కులధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్య దర్శి సీసం సురేష్, జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, గ్రామస్తులు పోడియం లక్ష్మణ్, కూర భీమయ్య, ఆనంద్, మడకం సురేష్, మడివి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడనం పట్ల అప్రమత్తంగా ఉన్నాం

రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె అనంతరం మీడియాతో కాసేపు మాట్లాడారు. ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడామని, ఎలాంటి ప్రమాదమూ జరగకుండా ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసి ఉంచామని తెలిపారు. తుపాను వల్ల ఏయే ప్రాంతాలు ప్రమాదానికి గురయ్యే అవకాశముందో ముందుగా గుర్తించి రక్షణ బృందాలను అక్కడకు పంపిస్తామని తెలిపారు. తుపాను షెల్టర్లను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటికే కర్నూలు, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం ప్రాంతాలను అప్రమత్తం చేశామని, ప్రతి మండలంలోనూ, జిల్లా కేంద్రంలోనూ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయనున్నామని అన్నారు. గంట గంటకూ ఎంత వర్షపాతం నమోదవుతుందో పర్యవేక్షించి ముందస్తు చర్యలు చేపడతామని ఆమె తెలిపారు. ఇప్పటికే సెలవులో ఉన్న అధికారులను సైతం విధుల్లోకి తీసుకుంటున్నామని, అత్యాధునిక టెక్నాలజీతోపాటు డ్రోన్లను కూడా వినియోగానికి సిద్ధం చేశామని తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఏర్పడితే వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేసిన ఇపిడిసిఎల్

సీతమ్మధార : భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఎపిఇపిడిసిఎల్ సిఎండి ఇమ్మడి పృధ్వీతేజ్ సంస్థ పరిధిలోని 11 జిల్లాల అధికారులను అప్రమత్తం చేశారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలతో పాటు కోనసీమ, కాకినాడ, ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ముందస్తు ఏర్పాట్లు చేసినట్టు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయాలూ లేకుండా చూడాలని, అవసరమైన యంత్రాంగం, పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఎస్ఇ, ఇఇలను ఆదేశించారు. తుపాను వల్ల ఏర్పడే విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. భారీ వర్షాల ప్రభావానికి తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లపై పడిపోయిన చెట్ల కొమ్మల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వాటి సమాచారాన్ని కార్పొరేట్ కార్యాలయంలోని టోల్ ఫ్రీ నెంబరు 1912 లేదా కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయం 8331018762 నెంబరుతో పనిచేస్తుందన్నారు. జిల్లాల కంట్రోల్ రూమ్‌లకు సంబంధించి శ్రీకాకుళం 9490612633, విజయనగరం 9490610102, పార్వతీపురం మన్యం 8332046778, విశాఖపట్నం 7382249881, అనకాపల్లి 9490610022, అల్లూరి సీతారామరాజు 9490610026, కోనసీమ 9440904477, కాకినాడ 9493178718, ఏలూరు 9440902926, తూర్పుగోదావరి 7382299960, పశ్చిమగోదావరి 9490610143 ఫోన్ నెంబర్లతో పనిచేస్తాయన్నారు.

అధ్యయనం పేరిట విహారయాత్రలా.. ?

ప్రజాధనంతో జివిఎంసి కార్పొరేటర్ల టూర్ తగదు

అన్ని పార్టీలూ వ్యతిరేకించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి కార్పొరేటర్ల అధ్యయన యాత్రను తమ పార్టీ వ్యతిరేకిస్తోందని, అధ్యయనం పేరుతో విహారయాత్రలు చేయడం తగదని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. జగదాంబ దరి నండూరి ప్రసాదరావు భవనంలో సోమవారం జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్, సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జివిఎంసికి పన్నుల రూపంలో ప్రజలు చెల్లిస్తున్న ప్రజాధనంతో విహార యాత్రలకు వెళ్లడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. ఈ టూర్‌ను అన్ని పార్టీలూ వ్యతిరేకించాలని కోరారు. కోయంబత్తూర్, మైసూర్, బెంగళూర్ నగరాలను కార్పొరేటర్లు అధ్యయనం చేయడానికి ఈ నెల 20 నుంచి 27 వరకు మహా విశాఖ నగర పాలక సంస్థ టూర్ ప్రోగ్రాంను నిర్ణయించిందన్నారు. అందులో అధ్యయనం కోసం కేవలం 3 గంటలు మాత్రమే కేటాయించారన్నారు. మిగతా రోజులన్నీ విహారయాత్రలేనని, అందుకే ఈ యాత్రను తమ పార్టీ వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఈ టూర్‌ను సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ యాత్రకు పెట్టే ఖర్చు ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరారు. గతంలో అధ్యయన యాత్రలకు వెళ్లి విశాఖను ఏం అభివృద్ధి చేసారని ప్రశ్నించారు. పేరుకే గ్రేటర్ విశాఖ, స్మార్ట్ సిటీ అని, రోడ్లన్నీ గతుకులుగా తయారయ్యాయని అన్నారు. వర్షాలకు రోడ్లపైనే మురుగునీరు పారుతోందని, పెద్ద ఎత్తున ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని అన్నారు. ఈ అధ్యయన యాత్ర వల్ల విశాఖ ప్రజలకు మేలు జరగకపోగా అనేక భారాలు మోపబడుతున్నాయన్నారు. పౌర సేవలను ప్రైవేటీకరించడానికేనా ఈ యాత్రలని ప్రశ్నించారు. ఇప్పటికే విలువ ఆధారిత పన్నులు భారీగా పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని, ఆ భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ వెంగయ్య

ఉద్యాన పరిశోధన స్థానం అధిపతిగా డాక్టర్ వెంగయ్య

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని పందిరి మామిడి గ్రామంలో గల డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని ఉద్యాన పరిశోధనా స్థానం అధిపతిగా డాక్టర్ పిసి వెంగయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వెంగయ్య ప్రస్తుతం ఇదే పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన పందిరి మామిడి పరిశోధన కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేస్తూ గిరిజనులకు ఉద్యానవన పంటలపై సాంకేతిక సహకారం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బదిలీ అయిన డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ లలిత కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని గోగుమిల్లి గ్రామ సమీపంలో నాటు సారా బట్టీపై సోమవారం పోలీసులు దాడి చేశారు. 400 లీటర్ల బెల్లపు ఊటను, 10 లీటర్ల నాటుసాలను ధ్వంసం చేసినట్లు రంపచోడవరం సబ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ దాడిలో అక్రమంగా సారాను తయారు చేస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా దుర్గాదేవి నిమజ్జనం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దారకొండలో దుర్గాదేవి నిమజ్జనం సోమవారం ఘనంగా నిర్వహించారు. గిరిజనులు తమ ఆచార సాంప్రదాయాలు అద్దం పట్టేలా థింసా నృత్యాలు చేస్తూ దుర్గాదేవి అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. నవరాత్రులు చివరి రోజు కావడంతో ఉదయం అమ్మవారి సన్నిధిలో భక్తులు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. డిజి సౌండ్ సిస్టంతో కుర్రకారులు చేసిన నృత్యాలు పలువురిని అకట్టుకున్నాయి. అనంతరం గ్రామ శివారులో నదిలో అమ్మవారిని నిమజ్జనం చేశారు.

అవినీతి ఆరోపణలపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విజయవాడ వరదల సమయంలో చేసిన ఖర్చుల్లో అవినీతి తారా స్థాయిలో జరిగినట్లు తెలుస్తోందని, ఈ నేపథ్యంలో ఆ అవినీతిపై విచారణ జరపాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వరద పరిహారాలు ఇచ్చేటపుడు బాధిత కుటుంబాల సంఖ్య వేలల్లో చూపించారని, అదే వరదల సందర్భంగా చేసినట్లు ప్రభుత్వం చెప్పిన ఖర్చుల ప్రకారం బాధిత కుటుంబాల సంఖ్యను లక్షల్లో చూపించారని అన్నారు.